క్లుప్తంగా

అన్నపూర్ణగా నీలమణి అమ్మవారు



సారవకోట: మండలంలోని అవలింగి గ్రామంలో నీలమణి అమ్మవారిని ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం అన్నపూర్ణదేవిగా అలంకరించారు. అమ్మవారిని అన్నంతో ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సంఘం అధ్యక్షుడు మోహన్‌రావు

నరసన్నపేట: విశ్రాంత వీఆర్వో, పంచాయతీ కార్యదర్శుల జిల్లా సంఘ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు రాష్ట్ర సంఘ ట్రెజరర్ వాన కనకయ్య గురువారం తెలిపారు. ఇప్పటివరకు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కూన సంజీవరావు మృతి చెందడంతో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. సంఘం అధ్యక్షుడిగా కింజరాపు మోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా లింగిబేరి రామప్పడు, కార్యదర్శిగా పంచిరెడ్డి సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా బి.ప్రసాదరావు, కోశాధికారిగా జి.కామేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేను అడుగుతున్న మహిళలు

కొత్తూరు: మండలంలో బలద గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మరో కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న సమయంలో కౌసల్యాపురం వద్ద ఆ గ్రామస్తులు ఎమ్మెల్యేను కాన్వాయ్‌ని నిలుపుదల చేశారు. వంశధార చెంతన ఉన్నా.. తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామన్నారు. వంశధార నుంచి పైపులైన్ ద్వారా, ఉద్దానం ప్రాజెక్టు నుంచి అయినా తాగునీటి సౌకర్యం కల్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వంశధార ఈఈగా మురళీమోహన్



నరసన్నపేట: స్థానిక వంశధార నిర్వహణ డివిజన్ పూర్తిస్థాయి ఈఈగా ఎం.మురళీమోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మురళీమోహన్ నరసన్నపేట సబ్ డివిజన్ డీఈగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార కాలువల్లో సాగు నీరు సక్రమంగా అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ధర్నా విజయవంతం చేయండి

నరసన్నపేట: రాష్ట్ర పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 15వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రరావు, ధర్మారావు, ట్రెజరర్ బి.మోహన్‌రావు గురువారం తెలిపారు. ఈ మేరకు సంఘ సభ్యులు అందరూ ఈ ధర్నాలో పాల్గొనాలని కోరారు. ఉదయం 11 నుంచి ఒంటి గంటల మధ్య ధర్నా నిర్వహిస్తామన్నారు.

డ్రమ్ సీడర్‌తో లాభాలు



డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలు వేస్తున్న దృశ్యం

పాతపట్నం: రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, కూలీలతో పనిలేకుండా డ్రమ్ సీడర్ ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం వల్ల రైతులకు అనేక లాభాలు చేరుకురుతాయని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు, పాతపట్నం యూనిట్ ఇన్‌చార్జి కె.పురుషోత్తం అన్నారు. మండలంలోని పెద్దలోగిడి గ్రామంలో రైతు దువ్వారి ఫల్గుణరావు పంట పొలంలో డ్రమ్ సీడర్‌తో గురువారం వరి విత్తనాలు వేశారు. అధునాతన పద్ధతుల్లో సాగు చేస్తే తక్కువ సమయంలో స్వల్ప పెట్టుబడితో అధిక దిగుబడులు వస్తాయన్నారు. డ్రమ్ సీడర్‌తో ఎకరా వరి సాగు చేస్తే సుమారు 45 బస్తాల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఐసీఆర్పీ ఎస్.నారాయణరావు, బి.శాంతయ్య, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో.. మోసం గ్యారెంటీ



మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, చిత్రంలో కుంభా రవిబాబు, తమ్మినేని సీతారాం, రెడ్డి శాంతి, నర్తు రామారావు, పాలవలస విక్రాంత్, దుంపల లక్ష్మణరావు

- హామీలు అమలు చేయకుండా ప్రజలకు వంచన
- రానున్న ఎన్నికల్లో టీడీపీ గల్లంతు ఖాయం
- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీపై ఇంటింటా ప్రచారం చేస్తాం
- పాతపట్నం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో నాయకులు
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు

పాతపట్నం/హిరమండలం: కూటమిది అబద్ధాల పాలన, ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి అమలు చేయకుండా జనాన్ని మోసం చేస్తోందని, దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి ప్రభుత్వ మెడలు వంచేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా సైనికుల్లా పనిచేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అధ్యక్షతన గురువారం పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణదాస్ మాట్లాడుతూ సంక్షేమం అంటే ఏమిటో రాష్ట్ర ప్రజలకు గడిచిన ఐదేళ్లలో వివిధ పథకాలతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపించారన్నారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు, కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల లబ్ధిదారులు ఎంతమేర నష్టపోయారన్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటింటికీ ప్రచారంతోపాటు రచ్చబండ వద్ద సమావేశం ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా నాయకులందరం అండగా ఉంటామన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, కొత్తూరు జెడ్పీటీసీ కామక భాగ్యలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ లొలుగు లక్ష్మణరావు, ఎంపీపీలు దొర సావిత్రమ్మ, రెడ్డి జ్యోతిలక్ష్మి, ఎస్.సావిత్రమ్మ, బైపోతు ఉదయ్‌కుమార్, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాల పార్టీ అధ్యక్షులు సవిరిగాన ప్రదీప్, పి.జయమునిరావు, మీసాల వెంకట రామకృష్ణ, ఎస్.ఆనంద్, పెనుమజ్జి విష్ణుమూర్తి, ఐటీ వింగ్ విభాగం అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం, జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు యోగి, రెడ్డి రామారావు, చింతాడ సూర్యనారాయణ, ఎ.వి.సురేష్, మామిడి గంగాధరరావు, కొండాల అర్జునుడు, తులుగు ప్రవీణ్, సవర రమేష్, గేదెల సూర్యం, ఎం.తాతయ్య, అమర రమణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, కుంభా రవిబాబు, తమ్మినేని సీతారాం, రెడ్డి శాంతి, నర్తు రామారావు, పాలవలస విక్రాంత్

రైతులకు దిక్కేది..



కూటమి ప్రభుత్వంలో రైతులకు భరోసా లేకుండా పోయిందని మాజీ స్పీకర్, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం అన్నారు. ఖరీఫ్ సీజన్ అరంభమైనా పెట్టుబడి సాయం అందలేదన్నారు. ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేశారన్నారు. విత్తనాల, ఎరువులు లభించడం లేదన్నారు. గత జగనన్న ప్రభుత్వంలో ఎరువులు, పురుగు మందులతో పాటు విత్తనాలు సమృద్ధిగా లభించేవన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ విషయాన్ని గ్రామాల్లో ఉన్న రైతులకు అవగాహన కల్పించి, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

అక్రమ దందాలో నంబర్ వన్..



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అక్రమ వసూళ్లతో ప్రజలు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు హడలిపోతున్నారని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. పాతపట్నం నియోజకవర్గం నుంచి ఒడిశాకు ఇసుక అక్రమంగా తరలిపోతుందన్నారు. ఉద్యోగుల బదిలీల్లో సైతం పైసా వసూల్ బహిరంగంగా జరుగుతోందని ఆరోపించారు. ప్రతి టీడీపీ కార్యకర్త నుంచి పెద్ద స్థాయి లీడర్ల వరకు వసూళ్ల పర్వం సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామం వెళ్లినా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధే కనబడుతోందన్నారు. కాగువాడ–రొమదల మధ్య మహేంద్ర తనయ నదిపై వంతెన, తాగునీటి అవసరాలకు రూ.265 కోట్లతో ఉద్దానం ప్రాజెక్టు ఫేజ్–2ను గత ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చామన్నారు. కూటమి నాయకులు అవే పనులకు రెండోసారి శంకుస్థాపన చేశారన్నారు. సచివాలయాలకు సొంత భవనాలు, సీసీ రోడ్లు, కాలువలు వంటివి దీనికి ప్రత్యక్ష సాక్ష్యాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలనను ప్రజలకు వివరిస్తూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



సమావేశంలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు, అభిమానులు

కూటమి మోసాలను వివరించాలి



చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించాలని శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకులు కుంభా రవిబాబు అన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో 18 నుంచి 50 ఏళ్ల మహిళలకు ప్రతి నెలా రూ.1,500, మహిళలకు ఫ్రీ బస్, యువతకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు, 2 లక్షల ఉద్యోగాలు, 50 ఏళ్లకే పింఛన్, రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలుచేయడంలో మొహం చాటేస్తున్నారని మండిపడ్డారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ పట్ల గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. చంద్రబాబుకు ఎందుకు ఓటేశామా అని ప్రజలు మదనపడుతున్నారన్నారు. జగనన్న కాలంలో పొందిన లబ్ధిని గుర్తు చేసుకుని ఎన్నికల సమయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం మనందరిపైనా ఉందన్నారు.

ప్రజలను చైతన్యవంతం చేయాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. చంద్రబాబు అనేక హామీలిచ్చి మోసం చేసిన తీరును గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు వివరించాల్సిన సమయం వచ్చిందన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో పాతపట్నంలో రెడ్డి శాంతిని ఎమ్మెల్యేగా గెలిపించి, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో అనేక హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశారని పార్టీ కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారన్నారు. అన్ని వర్గాల వారికి ఆర్థికంగా అండగా నిలిచారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జగన్ కంటే మెరుగైన పాలన అందిస్తానంటూ ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఏం చేస్తున్నారో గమనించి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు.

గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



గ్రీన్ అంబాసిడర్లకు సూచనలు చేస్తున్న డీపీఓ భారతీ సౌజన్య

నరసన్నపేట: గ్రామాల్లో చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్నామని, దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య అన్నారు. మండలంలోని జమ్ము గ్రామంలో గురువారం చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త సేకరణ చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చెత్త సేకరణ మెరుగుపడిందన్నారు. ప్రజల్లో మరింతగా అవగాహన రావాలని, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రోజూ మండలం యూనిట్‌గా ఒక గ్రామంలో ఉదయానికి ఎంపీడీఓల ఆధ్వర్యంలో బృందం వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జమ్ము పంచాయతీ కార్యదర్శికి తగిన సూచనలు చేశారు.

బియ్యం పరిశీలన


సాక్షి ఎఫెక్ట్



ఎస్సీ బాలుర వసతి గృహంలో బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ బాలకృష్ణ

కొత్తూరు: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంతోపాటు పలు పాఠశాలలకు పంపిణీ చేసిన సన్న బియ్యంలో పురుగులు ఉన్న విషయాన్ని సాక్షి పత్రికలో ఈ నెల 6వ తేదీన పురుగులిలా.. వండేదెలా అనే శీర్షికతో వార్త ప్రచురణం జరిగింది. ఈ వార్తపై తహసీల్దార్ బాలకృష్ణ స్పందించారు. కొత్తూరు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గురువారం సందర్శించి బియ్యాన్ని పరిశీలించారు. బియ్యంలో పురుగులు ఉన్నట్లు గుర్తించారు. పురుగులు ఉన్న బియ్యం వండొద్దని వార్డెన్ ఉమామహేశ్వరరావుకు ఆదేశించారు. ఈ బియ్యానికి బదులు మంచి బియ్యం పంపిణీ చేస్తామన్నారు. వీఆర్వో గిరీష్ కుమార్ పాల్గొన్నారు

పాతపట్నం ఏపీఎంగా రవిరాజ్



పాతపట్నం: మండల వెలుగు ఏపీఎంగా ఎస్.రవిరాజ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎల్.ఎన్.పేట మండలం ఏపీఎంగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏపీఎం ఎల్.ఎన్.పేట ఏపీఎంగా బదిలీపై వెళ్లారు. రవిరాజ్‌కు వెలుగు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అధ్వాన రహదారులు



ఆమదాలవలస మండలం ముద్దాడపేట సమీపంలో రోడ్డు దుస్థితి



సరుబుజ్జిలి మండలం పాలవలస వద్ద బురదమయంగా ఉన్న రహదారి

సరుబుజ్జిలి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు కుమ్మరిస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి చూపలేడం లేదు. దీనివలన గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, పీఎంజీఎస్‌వై రహదారుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాలు, వరదల సమయంలో రాకపోకలకు ప్రజలు అవస్థలకు గురవుతున్నారు.



చెరువును తలపిస్తున్న సరుబుజ్జిలి మండలంలోని బుడ్డివలస రోడ్డు

కృతజ్ఞతలు..



రెడ్డి శాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సింహాచలం

హిరమండలం: మండలంలోని అంబావల్లి గ్రామానికి చెందిన పొట్నూరు సింహాచలంను వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన కార్యదర్శిగా పార్టీ అధిష్టానం ఇటీవల నియమించింది. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతిని గురువారం పాతపట్నంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో యువజన కార్యదర్శిగా నియమించిందన్నారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

జలుమూరు: మండలంలోని తిమడాం నుంచి లింగంన్నాయుడుపేట వెళ్తున్న రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రోడ్లు, భవనాలశాఖ ఏఈ సరోజకు తిమడాం గ్రామస్తులు గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు ప్రైవేట్ పాఠశాల ఉండడంతో వందలాది మంది విద్యార్థులు రోజూ రోడ్డు దాటుతున్నారని ఎంపీటీసీ సభ్యురాలు వెలమల ప్రభావతి తెలిపారు. భోజన విరామ సమయం, విద్యార్థులను విడిచిపెట్టే సమయంలో అందరూ ఒకేసారి రోడ్డుపైకి వస్తున్నారన్నారు. ఆ సమయంలో అటుగా రోజూ పదుల సంఖ్యలో ఇసుక లారీలు, ఆటోలు వెళ్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

గురుపౌర్ణమిని వేడుకలను నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువులు, అర్చకులకు పాదపూజ చేశారు. షిర్డీ సాయి, పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: మల్లికార్జున స్వామి ఆలయంలో గురువులకు పాదపూజ నిర్వహిస్తున్న భక్తులు



బూర్జ: తుడ్డలి షిర్డీ సాయి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్న భక్తులు



కొత్తూరు: పారాపురంలోని షిర్డీ సాయి మందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



హిరమండలం: షిర్డీసాయి ఆలయంలో బారులు తీరిన భక్తులు



కొత్తూరు: ఉన్నత పాఠశాల వద్ద గురుపౌర్ణమి వేడుకలు



పాతపట్నం: షిర్డీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

బీఎల్‌ఓలకు సర్టిఫికెట్ల పంపిణీ



శిక్షణలో పాల్గొన్న బీఎల్‌ఓలతో జయదేవి

నరసన్నపేట: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. నరసన్నపేట మండలానికి చెందిన 50 మంది బీఎల్‌ఓలకు గురువారం శిక్షణ నిర్వహించారు. శిక్షణ అనంతరం ఆన్‌లైన్ పేపరులో బీఎల్‌ఓలు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. వారందరికీ ఈఆర్‌ఓ జి.జయదేవి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. జయదేవి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్‌ఓలదేనని అన్నారు. నరసన్నపేట తహసీల్దార్ టి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ పొదిలాపు శ్రీనివాసరావు, టీడీ శరత్, తదితరులు పాల్గొన్నారు.